## ఈనెల 12 నుండి 17 వరకు ఇర్రిపాకలో అంగరంగ వైభవంగా శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవం



**- అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి...**

**సర్వాంగ సుందరంగా శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవం - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి.శివ కేశవులు కొలువైన ఈ ఆలయాల వద్ద జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ శివకేశవులను ఒకే చోట ప్రతిష్టించాలని సంకల్పంతో ఈనెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవం కొరకు ఇర్రిపాక లో ఘనంగా ఏర్పాటు జరుగుతున్నాయని 12వ తేదీ ఉదయం కాతేరు నుండి భజన బృందాలు, మేళ తాళాలతో ఊరేగింపుగా దివాన్ చెరువు, మురారి, గండేపల్లి, మల్లేపల్లి, జగ్గంపేట మీదుగా ఇర్రిపాక విగ్రహాలు చేరుకుంటాయని ఈనెల 17వ తేదీన 11: 55 నిమిషాలకు శివ కేశవుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని వచ్చే భక్తులకు భోజన ప్రసాదం, తీర్థ ప్రసాదాలు, ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని భక్తులందరూ విచ్చేసి శివ కేశవుల కృపకు పాత్రులు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యులు వరపుల సుబ్బారావు, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, బ్రహ్మకుమారీలు, అన్నం దేవుల చంటి, భూపాలపట్నం ప్రసాద్, మారిశెట్టి రాధా, యర్ర బత్తుల గోవింద నాయుడు, బస్వా చినబాబు, బో దిరెడ్ల సుబ్బారావు బద్ది సురేష్, కాళ్ల వెంకటేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


18వ

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,12 ఫిబ్రవరి 2025




# బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్ఫ్లుఎంజా)పై అపోహలు వద్దు

- **రోగ లక్షణ కేసులను గుర్తించడానికి 64 వైద్య బృందాలతో ఇంటింటి సర్వే**
- **34 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసాం**
- **ఏవియన్ ఇన్ఫ్లుఎంజా నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం**
- **చికెన్ షాపుల్లో పనిచేసే కార్మికులకు స్వాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం**
- **వైరస్ ఇతర యానిమల్స్‌కి సోకకుండా ముందస్తుగా వాక్సినేషన్ వేస్తున్నాం**



**పెరవలి,మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ ప్రభావిత ప్రాంతాన్ని ఫిబ్రవరి 11వ తేదీ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలుతెలుసుకుంటున్న... జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో పౌల్ట్రీకోళ్లకు సంబంధించి భోపాల్ లో ఇన్స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ ఆఫ్ డిసీజ్ కన్ఫర్మేషన్ సెంటర్ ల్యాబ్ వారు ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ గా నిర్ధారించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలియచేశారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కానూరు అగ్రహారంలోని (ఏవియన్ ఇన్ఫ్లుఎంజా) ప్రభావిత ప్రాంతాన్ని రెవిన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ కానూరు అగ్రహారంలో వైరస్ నిర్ధారణ అయిన వెంటనే ప్రోటోకాల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కానూరు అగ్రహారంలో మూడు పౌల్ట్రీ ఫార్మ్లు ఉన్నాయని, ఇక్కడ చనిపోయిన కోళ్లు అన్నింటిని నిర్ధారణచేసి వాటిని పెస్టిసైడ్స్ తో క్రిమిసంహారము చేయటం జరిగిందన్నారు. అదే విధంగా ఒక కిలోమీటర్ పరిధిలో పరిమితం చేయబడిన జోన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఇక్కడ పౌల్ట్రీ నుంచిబర్డ్స్,ఎగ్స్ బయటికి రాకుండా చేసామన్నారు. ఈ ప్రాంతం నుంచి పది కిలోమీ టర్ల పరిధిలో సర్వేలెన్స్ జోన్‌గా ప్రకటించామన్నారు. ఈ ప్రాంతంలో చికెన్ షాపుల్లో పని చేసి వారిని గుర్తించి వారికి సాబ్ టెస్ట్ లు కూడా చేస్తున్నామన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పర్మిషన్ తీసుకొని కాకినాడ ల్యాబ్ నుంచి సాబ్ సాంపిల్స్ తీసుకుని హ్యూమన్ కు వైరస్ లేదనే నిర్ధారణ చేసుకోవలసి ఉందన్నారు. ఒక కిలోమీటర్ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ బృందం డోర్ టు డోర్ వైరస్ లక్షణాలను గుర్తించేందుకు క్యాంపెయిన్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 34 గ్రామాల్లో హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నమన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ పోలీస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక శాఖలను అప్రమత్తం చేయడంజరిగిందన్నారు. పశుసంవర్ధక శాఖ వారు ఈ వైరస్ ఇతర యానిమల్స్‌కి సోకకుండా వాక్సినేషన్ అందిస్తున్నారన్నారు. అదే విధంగా బరియల్ సంబంధిం చిన అంశాలన్నీ రెవిన్యూ శాఖ అధికారులు, పౌల్ట్రీ ఏరియాలోని ప్రదేశాన్ని సోడియం క్లోరైడ్ తో క్లీన్ చేసే పనులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు చేపట్టారని తెలిపారు. ఈ వైరస్ లక్షణాలు జిల్లాలోని ఇతర మండలాల్లో ఎక్కడ ఈ వ్యాధి లక్షణాలు కనిపించినా సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో బర్డ్‌నుంచి మనుషులకు ఎక్కడ వైరస్ సోకిన లక్షణాలు లేవన్నారు. ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో, పాఠశాలలకు ఒక వారం రోజులపాటు ఎగ్స్ సరఫరానిలుపుదల చేసామన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమలు ఎక్కువ, ఉత్పత్తి కూడా ఎక్కువగానే ఉంటుందన్నారు. కానూరు నుంచి కోళ్లు, క్రోడిగుడ్లు బయటికి వెళ్లకుండా పశుసంవర్ధక శాఖ అధికారులు, ఇతర సమన్వయ శాఖలతో పర్యవేక్షణ చేయాలని ఆదేశించామన్నారు. తద్వారా ఈ వైరస్ బయట ప్రబలకుండా ఉంటుందన్నారు. సీతానగరం, నల్లజర్లలో కూడా మంచి రిపోర్టు వచ్చి ందని, ఏ ఏరియాలో బర్డ్స్ చనిపోయాయో ఆ ప్రాంతంలో పూర్తిస్థాయి శానిటేషన్, ప్రోటోకాల్స్ పక్కగా నిర్వహించే పనులుచేపట్టామన్నారు. పౌల్ట్రీ నుండి ఉత్పత్తుల రవాణా నిలుపుదల చేసేటప్పుడు పోలీస్ ప్రొటెక్షన్‌తో పాటు పౌల్ట్రీ యాజమాన్య సహకారం తీసుకోవడం జరుగుతుందన్నారు. వైరస్‌సమాచారాన్ని తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, పౌల్ట్రీ బర్డ్స్ మాత్రమే కాకుండా ఇతర పక్షులు ఈ వైరస్‌తో ఎక్కడైనా చనిపోతే అటువంటి సమాచారాన్నికంట్రోల్‌రూమ్‌కి తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. సాధారణంగా వేసవిలో వైరస్ ఉంటుందని అందుకు సంబంధించి యానిమల్స్ వ్యాక్సినేషన్ వేయటం జరుగుతుందన్నారు. బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్ఫ్లుఎంజా)కోళ్లకు వచ్చిన వ్యాధి అని తగిన జాగ్రత్త లు పాటిస్తే మానవులకు ఈ వ్యాధి సోకదని, ప్రజలు ఆందోళన పడవలసిన పని లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. కానూరు అగ్రహారంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటి పర్యవేక్షణను చేపట్టి ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వ్యాప్తి దృష్ట్యా, వైద్య ఆరోగ్య శాఖ విధులు నిర్వహిస్తుందన్నారు. 10 కిలోమీటర్ల పరిధిలో వైద్య బృందాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కానూరు, సమిశ్రగూడెం, మార్కండపాడు , పెరవలి,ఉండ్రాజువరం, వేలువెన్ను ,సీతానగరం మండలాల పరిధిలోని గ్రామాల్లోవైద్యశిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. రోగలక్షణ కేసులను గుర్తించడానికి ఇంటింటి పర్యవేక్షణలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తో కూడిన 64 బృందాలను నియమించామన్నారు.

అవసరమైన వారికి అవగాహన కార్యక్రమాలు, వైద్య సహాయం అందించడానికి సంబంధిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. "ఏవియన్ ఇన్ఫ్లుఎంజా " నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. చికెన్ షాపుల్లో పనిచేసే కార్మికులకు స్వాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నమన్నారు.. ఈ పర్యటనలో కలెక్టర్ ప్రశాంతి వెంట ఆర్డీవో రాణి సుస్మిత, డిఎంహెచ్ఓ డా.కె.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి టి. శ్రీనివాసరావు, డిపిఓ వి. శాంతామణి, రెవెన్యూ,పోలీస్, సచివాలయ సిబ్బంది జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న సమరాధనలు

**- బండారు సంజీవ్ ప్రత్యేక పూజలు**



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలో వెలసియున్న అభయ ఆంజనేయ స్వామి, ర్యాలి గ్రామంలోని సత్తెమ్మ తల్లి ఆలయాల్లో మంగళవారం అన్న సమారాధన కార్యక్రమలు ఘనంగా జరిగాయి. బొబ్బర్లంక అభయ ఆంజనేయస్వామి 18వ వార్షికోత్సవ మహోత్సవం, అన్న సమారాధనకు, ర్యాలి సత్తమ్మ తల్లి ఆలయాల్లో జరిగిన అన్న సమారాధనలో టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్ ఆలయాల్లో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బర్లంక సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి, వెంకన్న, గణేష్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన మినీ మేడారం జాతర



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన దుమ్ముగూడెం మండలంలోని మారాయి గూడెంలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఆదివాసి బిడ్డల సమ్మక్క సారక్క మినీ జాతర ఈ నెల 11 నుండి 15 వరకు జరగనున్నది. జాతర కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగింది. ఈనెల 11- మంగళవారం (మండమేలుగుట) జాతర ప్రారంభోత్సం జరుగుతుంది. 12వ తేది బుధవారం ఒక్క పొద్దు రాత్రి 10 గంటలకు దేవత నిశానులు, సారలమ్మ గుడికి వచ్చును. 13వ తేదీ గురువారం నిండు జాతర మధ్యాహ్నం 12 గంటలకు వనదేవత గుడికి వచ్చును. సాయంత్రం 4 గంటలకు తల్లి దేవత గుట్ట నుండి గుడికి వచ్చునని ఆలయ నిర్వాహకులు దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చుమ్మ తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను ఈ జాతర రూపంలో కాపాడుకోవడం అందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ జాతర మహోత్సవానికి ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాల సరిహద్దు ఎంతో వైభవంగా జరుగుతుంది తెలిపారు.

## వై.మల్లిఖార్జునరెడ్డికి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు వై.మల్లిఖార్జున రెడ్డి సిద్ధాంత వ్యాసం "డైవర్స్ యాంటెన్నా కాన్ఫిగరేషన్ ఫర్ ఆర్బిటాల్ యాంగ్యులర్ మూమెంటమ్ (ఓఏఎం) వేవ్ జనరేషన్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. వై.మల్లిఖార్జున రెడ్డి తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడ జెఎన్‌టియుకె యూనివర్సిటీ ఇఓడబ్ల్యు & జి ఇన్‌ఛార్జి డైరెక్టర్ & యుసిఇకె ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.యు.వి.రత్నకుమారి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతాం

- **కేంద్ర సహకారంతో నవ్యాంధ్ర నిర్మాణం**
- **లోక్ సభలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**
- **ఆకట్టుకున్న ఎంపీ ఉదయ్ తొలి ప్రసంగం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో గత వైసిపి ప్రభుత్వం అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో నవ్యాంధ్ర నిర్మాణానికి కృషి చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం లోక్ సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో మధ్యతరగతి ప్రజలు, రైతాంగానికి మేలు చేసే విధంగా అనేక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు, ముఖ్యంగా 12 లక్షల ఆదాయం వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం శుభపరిణామన్నారు. దీనివల్ల దేశంలో 6.5 కోట్లమందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. గత ప్రభుత్వం హయంలో ఇంటింటికి త్రాగునీరు అందించేందుకు కేంద్రం జలజీవన్ మిషన్ ద్వారా రూ.16 వేల కోట్లు మంజూరు చేస్తే, గత వైసిపి ప్రభుత్వం కేవలం 2 వేల కోట్లు ఖర్చు చేసి పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌ని కలిసి జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితి పొడిగించడంతోపాటు అదనపు నిధులు మంజూరు చేయాలని కోరగా కేంద్రం సానుకూలంగా స్పందించిందని గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యం వహిస్తున్న గ్రామీణ అభివృద్ధి శాఖ ఏపీలో ఒకే రోజు 13,326 గ్రామసభలు నిర్వహించడంతోపాటు, 30 వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి రికార్డు సృష్టించామన్నారు. 974 కి.మీ. తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో నౌక నిర్మాణం ఇండస్ట్రీకి అపర అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడలో కేంద్ర సహకారంతో షిప్ బిల్డింగ్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కలెక్టర్‌ను కలిసిన కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్ క్లబ్ సభ్యులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** అధికారులు ప్రజాప్రతినిధులు ఎప్పటినుంచో కాకినాడలో మీడియా మిత్రులందరికీ ఒకే వేదికపై ఉండాలని కోరుకున్నవారికి దాదాపు విలేకరులందరూ ఒకే వేదికపైకి వచ్చి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలిని సీనియర్ పాత్రికేయులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికలు విధానాన్ని వివరించి, కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్ క్లబ్ కు అన్ని విధాల సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో సీనియర్ పాత్రికేయులు దురాని, స్వాతి ప్రసాద్, అంజి బాబు, సాయినాథ్, ఎన్నికైన నూతన అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కోశాధికారి చైతన్య, మేకల రమణ, ఆకెళ్ళ శ్రీనివాస్, త్రినాథ్, గుండె శ్రీనివాస్ తదితర సభ్యులు, గవర్నింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దీన దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో మెరక వీధి రామాలయం వద్ద భారతీయ జన సంఘ్ పార్టీ పూర్వ అధ్యక్షులు. బిజెపి పార్టీ సిద్ధాంత కర్త ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తితో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్నవారి నోర్లు మూయించడానికి ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని అట్టడుగున బలహీన వర్గాల పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించారని,వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థ, స్వావలంబన కల ఆర్థిక వ్యవస్థలు గ్రామాభివృద్ధికి ప్రధాన ఆధారం అని భావించాడు. భారతదేశం ఒక స్వతంత్ర, స్వాలంబన దేశంగా ఉండాలని భావించేవారు, వ్యక్తివాదం, సామ్యవాదం, కమ్యూనిజం, పెట్టుబడిదారీ విధానం వంటి పాశ్చాత్య భావనలపై భారతదేశం ఆధారపడ కూడదని పేర్కొన్నారని స్వాతంత్ర్యానంతర పాశ్చాత్యీకరణ నుండి బయటపడటానికి భారతదేశానికి ఇది అత్యవసరం అని దీన్‌దయాల్ అభిప్రాయపడ్డారని వారి సూచనలు, సలహాలు భారతీయ జనతా పార్టీకి శిరోధర్యమని ఏలేశ్వరం రూరల్ మండలం పూర్వ అధ్యక్షులు కూరాకులరాజా అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఏలేశ్వరం రూరల్ మండల యువమోర్చా అధ్యక్షుడు గరిక.నాగు పూర్వఉపాధ్యక్షుడు గొడుగు. నల్లబ్బాయి బండారు సూర్యనారాయణ మలిరెడ్డి. సూర్యచంద్ర కొల్లుమల్ల.వీర రాఘవులు మలిరెడ్డి. నారాయణరావు పెనుపోతుల.సత్తిబాబు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బర్డ్ ఫ్లూ దెబ్బకు లక్షలాదిగా రాలిపోతున్న కోళ్లు

**- కానూరు అగ్రహారం గ్రామంలోని కోళ్ల ఫారాలను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రశాంతి**

**- కలెక్టర్ ఆదేశాలతో చికెన్ షాపులు మూసి వేయమని నోటీసులు అందించిన అధికారులు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలో బర్డ్ ఫ్లూ వచ్చిన పౌల్ట్రీ ప్రదేశాలను( రెడ్ జోన్ ) ఫిబ్రవరి 11వ తేదీ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తనిఖీలు చేశారు. చికెన్ అమ్మ వద్దని కోడిగుడ్లు అమ్మవద్దని చికెన్ షాపులు మూసి వేయమని నోటీసులు ఇవ్వవలసిందిగా అధికారులను ఆదేశించారు కలెక్టర్ ఆదేశాలతో అధికారులు పెరవలి మండల వ్యాప్తంగా చికెన్ షాపులలో అమ్మకాలు నిలిపివేయమని చికెన్ షాపులు బంద్ చేయమని చికెన్ షాప్ ల యజమానులకు నోటీసులు అందించారు. కానూరు అగ్రహారం గ్రామములో రెడ్ జోన్ ఏరియా లో గల కోళ్ల ఫారంలలో మిగిలిన కోళ్లను స్పెషల్ టీమ్స్ బరియల్ చేయడం జరుగుచున్నది. పెరవలి మండలంలో అన్ని గ్రామములలో అధికారుల ఆదేశాల మేరకు శానిటైజ్ చేస్తున్నారు. కానూరు అగ్రహారం గ్రామములో స్పెషల్ టీం వచ్చి చనిపోయిన కోళ్లను, మిగిలిన కోళ్లను జెసిబి లు సాయంతో పెద్దపెద్ద గోతులు తీసి పూడ్చి పెడుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోడిగుడ్లను కాల్చి వేస్తున్నారు. కానూరు అగ్రహారం లో ఒక పౌల్ట్రీ నందు బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయినందున పరిసర ప్రాంతాలలో అనగా 10 కిలోమీటర్ పరిధిలో ఉన్న ఆయా గ్రామాలలో, దమ్మెన్ను, మోర్త , వెలగదుర్రు,తాటిపర్రు,ఉండ్రాజవరం, చివటం, పాలంగి, నందు తూర్పుగోదావరి జిల్లా కల్లెక్టర్ మరియు , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కే వెంకటేశ్వరరావు ఆదేశాలు మేరకు బర్డ్ ఫ్లూ ఫీవర్ సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వేలో బాగంగా పైన ఉదహరించిన గ్రామాలలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు , హెల్త్ అసిస్టెంట్ లు, ఎం.ఎల్.హెచ్.పి.లు ఆషాలు, ప్రతిగ్రామానికి 2 టీమ్ ల చొప్పున ఏర్పాటు చేసి బర్డ్ ఫ్లూ సర్వే నిర్వహించడం జరిగింది .ఈ సర్వే లో ఎవరికి బర్డ్ ఫ్లూ జ్వరాలు లేవని నిర్ధారించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఎం.వెంకటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు, ఆర్డిఓ సుస్మితా రాణి, అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ వి ఋషిప్రసాద్,డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ ఎస్ సత్యనారాయణ, డిపిఓ శాంతమణి, పెరవలి తాసిల్దార్ డి.అచ్యుతకుమారి పెరవలి మండల పశు వైద్యాధికారి డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర, కానూరు పిహెచ్‌సి వైద్యులు డా.హేమ రాజు, డాక్టర్ తేజశ్రీ, అన్ని డిపార్ట్మెంట్లకు చెందిన ఉన్నతాధికారులతో సహా ఇతర వైద్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల గెలుపే లక్ష్యం

**- జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్**



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** ఈనెలలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆలమూరు మండల జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం మండలం పార్టీ అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య అధ్యక్షతన ఆలమూరులో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ భారీ విజయంతో గెలుపొందే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన అన్నారు. గ్రామాలలో ఉన్న పట్టభద్రుల ఓటర్ల వివరాలు సేకరించి వారిని ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో పాల్గొని పేరాబత్తులకు ఓటు వేయించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో కూటమి పార్టీలతో సమన్వయంతో ముందుకు సాగాలని జనసైనికులకు సూచించారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎప్పుడు అండగా నిలుస్తానని బండారు శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు. ఆలమూరు జనసేన మండల అధ్యక్షులు సురపరెడ్డి సత్య.చింతలూరు జనసేన నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్ చౌదరి, గారపాటి త్రిమూర్తులు, సలాది జయప్రకాష్ నారాయణ (జెపి), తోట వెంకటేశ్వర్లు, నల్లా వెంకన్న, కొత్తపల్లి నగేష్ నాయుడు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, అడబాల వీర్రాజు పడాల అమ్మిరాజు, సిరిగినీడి పట్టాభి, చల్లా బాబి,డిపి.రావు, గుత్తుల నాగేశ్వరరావు, శీలం వెంకటరమణ, దేశభక్తుల సత్యనారాయణ, చల్ల వెంకటేశ్వరరావు, దాసి మోహన్, దాసరి వీర పండు, కర్రీ సత్యనారాయణ, సాయిబాబా, సోమశేఖర్, సుబ్రహ్మణ్యం, బలగం శివ, శ్రీపతి వీర వేణి, రాయమ్మ, మండల నాయకులు కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీరరాఘవుల విజయానికి సహకరించండి -ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు



సామర్లకోట, మేజర్ న్యూస్ : తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవుల విజయానికి ఎమ్మెల్సీ ఓటర్లు అందరూ సహకరించాలని తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు కోరారు. ఉపాధ్యాయ వృత్తిలో 40 ఏళ్ళు సేవలు అందించి అనేక ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేసిన అనుభవజ్ఞుడు డి వి రాఘవులను ఈనెల 27 వ తేదీన జరిగే పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలలో విజయం చేకూరిస్తే పట్టభద్రుల,ఉపాధ్యాయ,ప్రజ సమస్యలపై శాసనమండలిలో గళం విప్పేందుకు అవకాశం ఉంటుందని దీనికి ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ దిడ్ల వీరరాఘవుల కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి విజయం అందించాలని కోరారు. సామర్లకోట పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు ఆయన పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెక్రటరీ నరవ సురేష్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు కరణం ఏడుకొండలు, దారబాని కృష్ణ,చల్లా మహేష్,పసుపులేటి వీరబాబు,దారబాని సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## మాతృవర్ధంతి పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం, మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు మాతృమూర్తి 8వ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గారావు తల్లి జ్ఞాపకార్థం పట్టణంలో బాలికలు ,బాలల వసతి గృహంలో విద్యార్థులకు చాపలు పంపిణీ చేశారు. లింగంపర్తి గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ ప్రచారకర్త వీర భద్రరావు అప్పలరాజు దంపతుల కుటుంబానికి 25కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో కోరాడ రాజు, హాస్టల్ వారెన్స్ సిద్ధాంతపు నూకరాజు, పోతుబంది దేవతయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పంచారామ క్షేత్రం అయినా సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయం లో ఈనెల 24 నుంచి జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ అధికారులు ప్రారంభించారు. జోరుగా ఉత్సవాలకు సంభందించి ఆలయ ప్రాంగాణాల్లో చలువ పందిళ్ల ఏర్పాటు, భక్తుల దర్శనాలకు క్యూ లైన్లు ఏర్పాటు తో పాటు ఆలయ పుష్కరిణిలో పాత జలాలను తొలగించి సుబ్రమైన నీటిని నింపే కార్యక్రమాలను ప్రారంభించారు. ఇంకా ఆలయం, పరిసర ప్రాంతంలో విద్యుత్ దీపాల ఏర్పాటు, గోదావరి కాలువ వద్ద స్నానఘట్టం వద్ద, జల్లు స్నానంఘట్టం వద్ద భద్రత ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంత పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు ఈవో ఈ సందర్బంగా చెప్పారు.

# ఆర్ధిక చేయూత అందించేందుకు రుణాలు మంజూరు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** అల్పాదాయ వర్గాలకు, రైతులకు , మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు రుణాలు మంజూరు, యూనిట్స్ గ్రౌండింగ్ ప్రక్రియలో బ్యాంకర్లు కీలకపాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ దృశ్య మాధ్యమ సమావేశ మందిరంలో బ్యాంక్ రీజినల్ హెడ్స్ తో సిసి ఆర్సీ కార్డ్స్ – కౌలు రైతులకు రుణాలు, క్రాప్ ఇన్సూరెన్స్, పశుసంవర్ధక శాఖకి చెందిన పీకేసిసి లోన్స్, పి ఎం విశ్వకర్మ, సూర్య ఘర్, మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాలు మంజూరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో ప్రతి బ్యాంకర్లు వారి బ్యాంకు తరపున ఒక నోడల్ అధికారిని నియమించి, ఆ సమాచారాన్ని అందచేయాలని కోరారు. వివిధ శాఖలకు సంబంధించిన యూనిట్స్ గ్రౌండింగ్, రుణాలు మంజూరు చెయ్యడంలో సమన్వయం కొరవడడం వల్ల అనుకున్న స్థాయిలో ప్రగతి సాధించలేక పోతున్నామని తెలిపారు. జిల్లాకి సంబంధించి రాజమండ్రి, కొవ్వూరు డివిజన్ తూర్పు , పశ్చిమ గోదావరి జిల్లాలకి చెందిన దృష్ట్యా పరిపాలన పరంగా సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల లక్ష్యం నెరవేరడం లేదని తెలియ జేశారు. బ్యాంకర్ల నుంచి జవాబుదారీతనం కోరుకుంటు న్నామని, ఇందుకు సమన్వయం కోసం నోడల్ అధికారిని బ్యాంకర్లు




రాత పూర్వకంగా జిల్లా యంత్రాంగానికి తెలియ జేయ్యాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మధ్యవర్తిగా ఉండి సమన్వయ కర్తగా వ్యవహారుస్తున్నట్లు తెలిపారు. పీఎం విశ్వ కర్మ యోజన కింద 2733 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, వారిలో 661 మందికి రుణాలు మంజూరు చేసి, 508 యూనిట్స్‌కి రుణాలు అందించాం న్నారు. తూర్పు గోదావరి జిల్లా ప్రధానంగా వ్యవసాయ ఆధారిత జిల్లా అని కౌలు రైతులకు రుణాలు మంజూరు చెయ్యడం ఎస్ ఎల్ బి సి నిబంధనలు పాటించడం పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు. వ్యవసాయ రంగానికి సంబంధించి స్వల్ప కాల, టర్మ్, మౌలిక , అనుబంధ రంగాలకు రుణాల లక్ష్యంలో ఎస్ ఎల్ బి సి నిర్ధారించిన 11,106కి గాను 10,217 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. లక్షా తొమ్మిది వేల సి సి ఆర్ సి కార్డులు జారీ చెయ్యగా , వాటిలో 4558 మందికి రూ.42 కోట్ల మెర మాత్రమే రుణాలు ఇచ్చారన్నారు.పీఎం ఉపాధి కల్పన కార్యక్రమం – ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల బోర్డు, ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల కమిషన్, జిల్లా పరిశ్రమల కేంద్రంకి చెందిన 599 యూనిట్స్‌కి గాను 319 మంజూరు చేసి 313 యూనిట్స్ రూ.13.04 కోట్లతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుకి చెంది 12,871 దరఖాస్తులు పంపగా 816 యూనిట్స్‌ను రూ.4 కోట్ల 27 లక్షలతో గ్రౌండింగ్ చేశారు. మిగిలిన యూనిట్స్ కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రౌండింగ్ చెయ్యాలన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలని కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ డి వి ప్రసాద్, ఎస్బీఐ జోనల్ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా, ప్రాంతీయ హెడ్ శ్రీనివాస్ రావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఏ విశ్వేశ్వర రావు, ఇతర బ్యాంకుల మేనేజర్లు, రీజినల్ మేనేజర్, సిఈవోలు,క్లస్టర్ హెడ్స్,చీఫ్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం విక్రయ ముఠా అరెస్ట్

**– రూ.9,25,888/- విలువగల 20128 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ మరియు కాకినాడ ఎస్డిపిఓ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ వారి ఆధ్వర్యంలో... రేషన్ బియ్యం అక్రమ రవాణా చేయుచున్న మరియు నిల్వచేసిన వారిపై దాడి చేసి రూ. 9,25,888/- విలువగల 20128 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని మూడు వాహనాలతో సహా 7 గురుని అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. పిఠాపురం సర్కిల్ గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోగల పిఠాపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గొల్లప్రోలు, దుర్గాడ, బి .ప్రత్తిపాడు, ఎఫ్ కే పాలెం గ్రామాలలో అక్రమంగా నిల్వ ఉంచి, రవాణాకు సిద్ధంగా చేసిన రేషన్ అక్రమ నిల్వదారులు మరియు రవాణా చేస్తున్న వారిపై గొల్లప్రోలు ఎస్సై ఎన్. రామకృష్ణ, పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్. గుణశేఖర్ వారి సిబ్బంది మరియు పిఠాపురం సర్కిల్ క్రైమ్ పార్టీతో విస్తృతంగా దాడులు నిర్వహించి మొత్తం 7 గురు వ్యక్తులు అనగా 1. మొగిలి దుర్గా ఆనందరావు, 2. సిరిపు రెడ్డి వీరభద్రరావు, 3. కర్రి కృష్ణ 4. కీర్తి సూరిబాబు, 5. ఊట ధర్మరాజు, 6. ఊటా శివ శంకర్, 7.లింగం చిన బాబ్జీ వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మొత్తం 20,128 కేజీల రేషన్ బియ్యం, సుమారు విలువ రూ .9,25,888, మూడు రవాణా వాహనాలు 1)టాటా బడా దోస్త్ ఏపీ 39 యూజి 4353, 2)లారీ డబ్ల్యువి 33 ఈ 5049, 3) బొలెరో పికప్ ఏపీ 39 విడి 9558 లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## గాన లోకానికే గంధర్వుడు ఘంటసాల



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర 51 వర్ధంతి సందర్భంగా జలవనురుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయ ఆవరణ సమీపంలో గల ఘంటసాల విగ్రహానికి గోదావరి కల్చరల్ అసోసియేషన్ "రాకా" సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు, అధ్యక్షులు జివి రమణ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధునిగా స్వతంత్ర భారతదేశానికి సేవలు అందించేందుకు పద్నాలుగు నెలలు జైలు జీవితం గడిపారన్నారు. కార్యాదృక్షులు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ గాయకుడిగా కేవలం మూడు దశాబ్దాలు సినీ పాటలు పాడినా మూడు శతాబ్దాలైనా ప్రజా హృదయాల్లో ఆయన జీవించే ఉంటారన్నారు, ఆధ్యాత్మికవేత్త వేగిశెట్టి కోదండ రామారావు మాట్లాడుతూ ఘంటసాల తెలుగు వాడిగా పుట్టడం మన అదృష్టం అన్నారు, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహమ్మద్ షా అలీ, ఆకుల రామచంద్రరావు, భమాడి పాటి రాధాకృష్ణ మూర్తి, పి.వి. కృష్ణారావు, రాయుడు చంద్రశేఖర్, బర్రె సుబ్రమణ్యం, దొండపాటి సుబ్రమణ్యం, ఒంటెద్దు స్వామి, వీర్రాజు గోదారి కల్చర్ క్లబ్ సభ్యులు గాదిరాజు రామరాజు, మాదాబత్తుల ఏడుకొండలు, ముదేడ్ల రమేష్,ఎమ్.వి.రావు, ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రావులపాలెం, మేజర్ న్యూస్ : రావులపాలెం గౌతమీ గోదావరీ బ్రిడ్జి కింద నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక వీఆర్వో సమాచారం మేరకు వారు ఇచ్చిన రిపోర్ట్‌పై రావులపాలెం పోలీసు స్టేషన్ ఎస్సై చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహమును కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురి షెడ్‌లో ఉంచడమైనదని తెలిపారు. మృతురాలు సుమారు 5 అడుగుల 4 అంగుళాలు పొడవు, జుట్టు 6 అంగుళాలు, నీలి రంగు చీర, జాకెట్, చర్మం పూర్తిగా కమిలిపోయి, ఊడిపోయి ఉన్నది. ప్రమాదవశాత్తూ నదిలో జారిపడి ఇక్కడివరకు కొట్టుకుని వచ్చి యుండవచ్చునని అభిప్రాయము తెలిపారు. వివరాలకు రావులపాలెం సీఐ శేఖర్ బాబు 9440796567, ఎస్సై 8712689529 నెంబర్‌లను సంప్రదించవల్సిందిగా కోరారు.

## బాలిక మృతికి కారకులైన ఉద్యోగులు సస్పెన్షన్



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** నులిపురుగుల మాత్రలు సరైన పద్ధతిలో వెయ్యనందున ఒక బాలిక మృతి చెందినందుకు కారణ మైన అంగన్వాడి సూపర్వైజర్ ను, ఆశ వర్కర్‌ను, ఎయన్‌యంను, అంగన్వాడి టీచర్ను, ఫార్మసిస్టును విధులు నుండి సస్పెండ్ చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి క్యాంపు కార్యాలయంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామంలో కత్తుల వెంకటరెడ్డి, సుబ్బలక్ష్మి దంపతుల కత్తుల రేష్మిత ఐదు సంవత్సరాలు బేబీ నులిపురుగుల మాత్రలు పద్ధతి ప్రకారం బేబీకి మాత్రలు వెయ్యనందున బేబీ సీరియస్ అవ్వటం వలన వెంటనే రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించగా రేష్మిత చనిపోవడం జరిగిందని, నిర్లక్ష్యం వహించిన అంగన్వాడి సూపర్వైజర్ ను, ఎయన్‌యం ను, ఆశ వర్కర్ ను, అంగన్వాడీ టీచర్ ను, ఫార్మసిస్టును విధులు నుండి సస్పెండ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సంబంధిత వైద్యాధికారులకు షోకజ్ నోటీసులు కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. వెంటనే తాడేపల్లి గ్రామం సందర్శించి బేబీ ఏవిధంగా చనిపోయింది, ఏవిధంగా మాత్రలు వేసింది కొన్ని వివరాలు స్వీకరించడం జరిగిందని, అదేవిధంగా పూర్తి స్థాయిలో విచారణ చేయించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్ఫ్లుఎంజా)పై అపోహలు వద్దు

**– జిల్లాలో బర్డ్ ఫ్లూ(ఏవియన్ ఇన్ఫ్లుఎంజా)**



**పెరవలి,మేజర్‌న్యూస్ :** కోళ్లకు వచ్చిన వ్యాధి అని తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని, ప్రజలు ఆందోళన పడవలసిన పని లేదని జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. వెంకటేశ్వర రావు అన్నారు. మంగళవారం జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. వెంకటేశ్వర రావు వైద్యులు, వైద్య సిబ్బందితో కలసి కానూరు అగ్రహారం ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ ఉన్న తగు జాగ్రత్త లు పాటించడం చాలా ముఖ్యని, ఆరోగ్యంగా ఉండటానికి మాత్రమే కాకుండా, వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి కూడా ఈ జాగ్రత్తలు అవసరం అని తెలియ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్ళునొప్పులు వంటి లక్షణములు వచ్చిన వెంటనే వైద్య సిబ్బందికి తెలియచేయాలన్నారు. కానూరు అగ్రహారం ను రెడ్ జోన్‌గా చేసి ప్రజలలో ఉన్న అపోహలు తొలగిస్తున్నారని తెలియచేసారు. కోడిగుడ్లు, చికెన్ వినియోగం, రవాణ చేయడం , శుభ్రం చేయడం మరియు వంటకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన తెలియ చేశారు.

**-1. చికెన్ మరియు కోడిగుడ్లు వినియోగం..** చికెన్ పూర్తిగా వండిన తర్వాత మాత్రమే తినాలి (75డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో ఉడికించాలి)- ముడి మాంసం తినకూడదు, హాఫ్-బాయిల్ చేసిన గుడ్లు తినకూడదు.- కోడిగుడ్లు మరియు చికెన్ చేతితో తాకినా తర్వాత బాగా చేతులు కడుక్కోవాలి.- చికెన్ మరియు గుడ్లను వేరు వేరు నిల్వ చేయాలి, ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు.

**-2. ముడి మాంసాన్ని నిర్వహించడం..**- ముడి చికెన్ లేదా కోడిగుడ్లు తాకిన ఉపకరణాలు బాగా శుభ్రం చేయాలి. - కత్తులు, బోర్డులు, ప్లేట్లు వేరుగా ఉంచి వేడినీటితో కడిగాలి.- ముడి మాంసాన్ని నిల్వ చేయేటప్పుడు, ఇతర ఆహార పదార్థాలకు తాకకుండా మూయించాలి.

**-3. చికెన్ రవాణా సమయంలో జాగ్రత్తలు ..**- కోళ్లు మరణించి ఉంటే వాటిని జాగ్రత్తగా తగిన జాగర్తలు తీసుకొని వాటిని నిర్మూలన చేయాలనీ తెలియచేసారు - రవాణా చేసే డబ్బాలు, తరచుగా శుభ్రం చేయాలి.- బర్డ్ ఫ్లూ ప్రబలిన ప్రాంతాల నుండి చికెన్, గుడ్ల రవాణా చేయకుండా ఉండాలి. - కోళ్లు లేదా మాంసాన్ని తీసుకురావడం తర్వాత వెంటనే శుభ్రం చేసుకోవాలి.

**4. చికెన్ శుభ్రం & వంట చేయడం**

- మాంసాన్ని ఉడకబెట్టిన తర్వాత మాత్రమే కడిగితే మంచిది- వేడినీటిలో కడిగి, ఎవరైనా చేతితో తాకినట్లయితే వెంటనే చేతులు కడుక్కోవాలి.
- వంట ముందు కిచెన్ శుభ్రం చేసుకోవాలి. - చికెన్ వండిన తర్వాత దాని ఉష్ణోగ్రత 75డిగ్రీలకి చేరుకున్నదని నిర్ధారించుకోవాలి.

-ఏవియన్ ఇన్ఫ్లుఎంజా(బర్డ్ ఫ్లూ)- వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో, వైద్య ఆరోగ్య శాఖ ఈ క్రింది చర్యలను చేపట్టింది:

డోర్-టు-డోర్ నిఘా:-10-కిలోమీటర్ల పరిధిలో, మా బృందాలు కింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కవర్ చేశాయి: కానూరు, సమిశ్రగూడెం, మార్కండపాడు, పెరవలి, ఉండ్రాజువరం, వెలువెన్ను మరియు సీతానగరం, 34 గ్రామాలలో విస్తరించి ఉన్నాయి. రోగలక్షణ కేసులను గుర్తించడం కోసం ఇంటింటికీ నిఘా నిర్వహించడానికి 64 బృందాలను నియమించడం జరిగింది.

-వైద్య శిబిరాలు:- అవసరమైన వారికి వైద్యం అందించేందుకు ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు.

-హెల్త్ ఎడ్యుకేషన్ : -ఏవియన్ ఇన్ఫ్లుఎంజాపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో నిఘా సమయంలో ఆరోగ్య విద్యా సదస్సులు నిర్వహించడం జరుగుతున్నాయని తెలియ చేశారు.

**-స్వాబ్ పరీక్షలు:- అనుమానితుల కేసులను గుర్తించడానికి పౌల్ట్రీ కార్మికులకు స్వాబ్ పరీక్షలు నిర్వహించడం.**

ఇటువంటి సమయంలో ప్రజలు అప్రమత్తం గా ఉండాలని ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్ళునొప్పులు వంటి లక్షణములు వచ్చిన వెంటనే వైద్య సిబ్బంది కి తెలియ చేయాలనీ కానూరు అగ్రహారం ను రెడ్ జోన్ గా చేసి ప్రజలలో ఉన్న అపోహలు తొలగిస్తున్నారని తెలియచేసారు. ఈ కార్యక్రమములో కొవ్వూరు డివిజన్ ఇంచార్జ్ డిప్యూటీ డి ఎం హెచ్ ఒ డా. ఈ డా.ఎస్. ధర్మ రాజు, డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ అధికారి డా. రాజీవ్, డా. అభిషేక్, ఎపిడమాలోజిస్ట్ బి. సుధీర్ బాబు, కానూరు పిహెచ్ సి వైద్యాధికారి డా. హేమరాజు, డిస్ట్రిక్ ఎపిడమిక్ సెల్ ఎంపిహెచ్ఇఒ జాన్సన్ రాజు, సిసిబి రాజు, సూపెర్వైజర్స్ ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సమాజానికి వెన్నెముక, బలమైనవారు, అజేయులు, స్ఫూర్తిదాయకులు - డా.అడ్డాల

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో కాకినాడ ఐడిఎ మరియు ఆదిత్య కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యాన అంతర్జాతీయ సైన్స్ రంగంలో మహిళలు మరియు బాలికల దినోత్సవం సంధర్భంగా సైన్స్‌లో విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు సైన్స్ కిట్ లను అందజేశారు. ఈ సంధర్భంగా ఆదిత్య కళాశాల కో ఆర్డినేటర్ డా.బిఇఎల్ఎన్ నాయుడు మాట్లాడుతూ" 2015 సంవత్సరంలో, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఫిబ్రవరి 11ని, అంతర్జాతీయ సైన్స్ రంగంలో మహిళలు మరియు బాలికల దినోత్సవంగా ప్రకటించిందని ఈ రోజునమనం 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.కాకినాడ ఐడిఎ మహిళా శాఖ కన్వీనర్ డా దీప మాట్లాడుతూ"మన దేశ మహిళలు ఎటు వంటి సవాళ్లనైనా పరిష్కరించే తెగువ ధైర్యం ఉన్నవారని అన్నారు. మేరీ



క్యూరీ వంటి మార్గదర్శకులు మహిళలు శాస్త్రీయ విభాగాలను రూపొందించగలరని మరియు నడిపించగలరని నిరూపించారని అయినప్పటికీ, విస్తృతంగా గుర్తింపు పొందిన కొద్దిమంది మహిళా శాస్త్రవేత్తలలో ఒకరిగా ఆమె స్థానం లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మరియు మరింత వైవిధ్యమైన సహకారాలను జరుపుకోవడానికి తక్షణ అవసరాన్ని వెల్లడిస్తుందని అన్నారు.

కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ" "సైన్స్‌లో లింగ అంతరాన్ని మూసివేయడం" అనే యునెస్కో పిలుపు ఆధారంగా , శాస్త్రీయ ఆవిష్కరణలలో మహిళల కీలక పాత్రను పోషిస్తున్నారని మరియు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు గణితం కెరీర్‌లలో విశేష ప్రతిభ తో ముందుకెళుతున్నారని అన్నారు. స్త్రీ శక్తి అంతులేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తేజేశ్వరరావు, గౌరిప్రియ, డా శ్రీవల్లి ,డా నాగేంద్ర, డా పద్మావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్స్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్స్‌లో భాగంగా మంగళవారం ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం నిర్వహించిన జనరల్ విభాగంలో 3326 మందికిగాను 3285 మంది హాజరై 41 మంది గైర్హాజరు అయినారని, మధ్యాహ్నం 2991 మందికీ గాను 2967 మంది హాజరై 24 మంది గైర్హాజరు అయినట్లు తూర్పుగోదావరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్వీఎల్ నరశింహం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వొకేషనల్ విభాగంలో ఉదయం 755 మందికిగాను 679 హాజరు కాగా 76 మంది గైర్హాజరైనారని, మధ్యాహ్నం 595 మందికి గాను 577 మంది హాజరై 18 మంది గైర్హాజరైనారని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు. అన్ని పరీక్షా కేంద్రాలలోను ప్రాక్టికల్ పరీక్షల ప్రశాంతంగా జరిగే అని ఆయన తెలిపారు.

## బుధవారం మన్యం బంద్ విరమణ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** 1/70 యాక్ట్ సవరించాలని ఏపి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న బంద్ విరమిస్తున్నట్లు గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు వంతు బాలకృష్ణ,తాము సూరిబాబు,కొండ్ల సూరిబాబు,గంపా నాగరాజు తదితరులు మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం రాజవొమ్మంగిలో గిరిజన సంఘాల ఐక్యవేదిక సమావేశం ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు,పి రామరాజు, వజ్రపు అప్పారావు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా గిరిజన నాయకులు వంతు బాలకృష్ణ,తాము సూరిబాబు,తదితరులు మాట్లాడుతూ.1/70 యాక్ట్,గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, అయ్యన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ11,12 తేదీలలో గిరిజన సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆదివాసీలు పోరాటం ఉదృతం చేశారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1/70 చట్టం అమలకై స్పష్టమైన హామీ ఇవ్వడంతో రేపు 12న జరగాల్సిన బంద్ విరమించినట్లు గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. మంగళవారం బంద్ కు సహకరించిన మండల ప్రజలు,పలు ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, దుకాణ దారులకు, గిరిజనులకు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు సింగిరెడ్డి అచ్చారావ్,జి ప్రసాద్, ఈకా శ్రీను,పి చిన్నాలు దొర,వై లక్ష్మణరెడ్డి.బి రామకృష్ణ,కుంజం జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

## వీరరాఘవుల విజయానికి సహకరించండి

**– గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు**



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవుల విజయానికి ఎమ్మెల్సీ ఓటర్లు అందరూ సహకరించాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు కోరారు. ఉపాధ్యాయ వృత్తిలో 40 ఏళ్ళు సేవలు అందించి అనేక ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేసిన అనుభవజ్ఞుడు డి వి రాఘవులను ఈనెల 27 వ తేదీన జరిగే పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలలో విజయం చేకూరిస్తే పట్టభద్రుల, ఉపాధ్యాయ, ప్రజ సమస్యలపై శాసనమండలిలో గళం విప్పేందుకు అవకాశం ఉంటుందని దీనికి ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ దిడ్ల వీరరాఘవుల కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి విజయం అందించాలని కోరారు. మనందరి తరపున ఎవరైనా నిజాయితీగా నిలబడ్డారు అంటే అది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని, మన సమస్యలపై శాసనమండలిలో గళం ఎత్తేవారన్నారు.అనేక ప్రజా పోరాటాలకు అండగా నిలిచే వారిని శాసన మండలికి తీసుకువెళ్లి ప్రజల గొంతుకగా నిలబెట్టాలని అన్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు ఆయన పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెక్రటరీ నరవ సురేష్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు కరణం ఏడుకొండలు, దారబాని కృష్ణ,చల్లా మహేష్,పసుపులేటి వీరబాబు,దారబాని సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే లు, యం.పి లు స్పందించాలని, జాతి మనుగడ కోసం ఆదివాసీల తరుపున బందల్లో పాల్గొనాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు మంగళవారం పిలుపునిచ్చారు. 1/70 చట్టాన్ని సవరణ చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రంలో గిరిజన ఎమ్మెల్యేలు ఎంపీలు స్పందించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు డిమాండ్ చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు యావత్తు ఆదివాసీల మనోభావాలు దెబ్బతినేలా చేశాయని, ఆ వ్యాఖ్యలతో ఆదివాసీలను కించపరిచారని, అలాగే ఆదివాసీలకు భయభ్రాంతులకు గురిచేసారని, అందువలన ఆదివాసీలు సంఘాలకు, పార్టీలకు అతీతంగా ఐక్య పోరాటానికి సిద్ధం అయ్యారన్నారు. ఈ మేరకు రేపు రాష్ట్ర వ్యాప్తంగా మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాలకు, ప్రజా సంఘాలకు, ఆదివాసీ ప్రజానీకానికి, ఉద్యోగులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు, మద్దతు ఇచ్చే రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై ఆదివాసీ ఎంపీలు ఎమ్మెల్యేలు స్పందించాలని, అలాగే ప్రత్యేకంగా మన్యం బంద్‌లో పాల్గొనాలని డిమాండ్ చేశారు.

# వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి మంగళవారం నర్సాపురంకు చెందిన కైలా సతీష్ కుమార్ , లావణ్య దంపతులు రూ. 51,116లు విరాళంగా అందించారు.

వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన సదస్సు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో మంగళవారం ఉదయం సెనేట్ హాలు నందు మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్&ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మైటీ) సహకారంతో సిఎస్ఈ విభాగంలోని ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ) ప్రాజెక్ట్ ఫేజ్-3 ఆధ్వర్యంలో 'సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం' సందర్భంగా ఇంటర్నెట్ యొక్క సురక్షితమైన, బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా బీటెక్ సిఎస్ఈ, ఈసిఈ, ఎంసిఏ, ఎంటెక్ సిఎస్ఈ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్‌జి. మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా అతిథిగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి. రవీంద్రనాథ్, ముఖ్యవక్తగా జెఎన్‌టియుకె ఐటి&ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ. ఏ. ఎస్. ఎన్. చక్రవర్తిలు వేదికనలంక రించారు. రెక్టార్ &ఐఎస్ఈఏ ఫేజ్-3 ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొ. కెవి. రమణ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా యుసిఇకె సిఎస్ఈ విభాగాధిపతి&ఐఎస్ఈఏ ఫేజ్-3 కో-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొ. ఎన్. రామకృష్ణయ్య అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్‌జి. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఏటా ఫిబ్రవరి 11వ తేదీన సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, ఈ ఏడాది 'మెరుగైన ఇంటర్నెట్ కోసం' అనే థీమ్‌తో జరుపుకుంటున్నామన్నారు. ఐఎస్ఈఏ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని రెండు విశ్వవిద్యాలయాలు ఆంధ్రా యూనివర్శిటీ మరియు జెఎన్‌టియుకె కాకినాడలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సురక్షితమైన ఆన్‌లైన్ అభ్యాసాలపై విభిన్న ఇంటర్నెట్ వినియోగదారులకు అవగాహన కల్పించడం, సైబర్ భద్రత, బాధ్యతాయుతమైన వినియోగాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఇంటర్నెట్ వినియోగానికి ఉత్తమ మార్గం దానిని పరిమితంగా వినియోగించడమేనన్నారు. ప్రతీరోజు ఒక గంట




పాటు ప్రకృతితోను, పుస్తకాలతోను మరియు స్నేహితులతో సమయం గడిపితేఇంటర్నెట్‌కు పరిమితంగా సమయం కేటాయించవచ్చునన్నారు. ఇంటర్నెట్‌కు బానిసలుగా మారితే మరిన్ని దుర్వసనాలకు గురి కావడంతో పాటు అది మనకు శత్రువుగా మారుతుందన్నారు. స్మార్ట్ ఫోన్‌ను వినియోగించేటపుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకుని ఇతరులు సైబర్ మోసాలకు గురికాకుండా చూడాలన్నారు. రెక్టార్&ఐఎస్ఈఏ ఫేజ్-3 ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొ. కెవి. రమణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐఎస్ఈఏ ప్రాజెక్ట్‌కు 50 విద్యాసంస్థలు ఎంపిక కాగా అందులో ఒకటి జెఎన్‌టియుకె కాకినాడ అని తెలిపారు. ఈప్రాజెక్ట్ ద్వారా ఐదేళ్ల పాటు ప్రతీ ఏటా రూ. 50లక్షల పైచిలుకు నిధులతో సైబర్ సెక్యూరిటీ (బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఫిన్‌టెక్ టెక్నాలజీ)పై విద్యార్థులకు మరియు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే ఐఎస్ఈఏ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. అలాగే రూ. 40లక్షల నిధులతో సిఎస్ఈ విభాగంలోని ల్యాబ్‌లో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జిపియు)ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ




జిపియు ద్వారా సిఎస్ఈ, ఈసిఈ విద్యార్థులు వినూత్నమైన సైబర్ ప్రాజెక్ట్‌లు రూపొందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై విద్యార్థులు అవగాహన కలుగజేసుకుని ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలపాల్సిన బాధ్యత ఉందన్నారు. జెఎన్‌టియుకె ఐటి&ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ. ఏ. ఎస్. ఎన్. చక్రవర్తి మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని మనం ఎప్పటికప్పుడు జాగ్రత్తగా వ్యవహరించడం ద్వారా సైబర్ మోసాల బారిన పడకుండా ఉంటామన్నారు. డిజిటల్ గాడ్జెట్‌లు, స్మార్ట్ ఫోన్‌ల గురించి పూర్తిగా తెలుసుకుని వినియోగించాలన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ముందే జాగ్రత్తగా వ్యవహరించడం మంచిదన్నారు. అనంతరం సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకెలోని 200 మంది బీటెక్, ఎంటెక్, ఎంసిఏ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో తొలిరోజు ఆదివాసీలు బంద్ విజయవంతం

**- స్పీకర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పిఎస్‌లో ఫిర్యాదు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఏజెన్సీ వ్యాప్తంగా 48 గంటల పాటు ఆదివాసీలు తల పెట్టిన బందు రాజవొమ్మంగి మండలంలో మొదటి రోజు విజయవంతం అయింది. వ్యాపార స్తులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి బందులో పాల్గొన్నారు. ఇటీవల అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టం సవరణ వ్యాఖ్యలును వ్యతిరేకిస్తూ ఆదివాసీలు రాష్ట్రవ్యాప్తంగా మన్యం బందుకు పిలుపు నిచ్చిన నేపథ్యంలోరాజవొమ్మంగిలో ఆదివాసి జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావు ఆధ్వర్యంలో ఆదివాసీ లు తొలిత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బాలకృష్ణ, సూరిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్ అయ్యన్న పాత్రుడు 170 చట్టం ఆదివాసీలు పట్ల చేసిన వ్యాఖ్యలు విచార కరమన్నారు. ఆదివాసీ లకు వ్యతిరేకంగా 1/70 చట్టం రద్దు చేయాలని ఆయన చేసిన వ్యాఖ్యలు ఏజెన్సీ వ్యాప్తంగా ఆదివాసులను తీవ్ర మనస్థాపానికి గురు చేశాయన్నారు. ఆదివాసులు మనుగడకు, ఉపాధికి, అభివృద్ధికి అవసరమైన 1/70 చట్టం సవరణ చేయాలనడం దుర్మార్గమన్నారు. ఈ కారణంతోనే ఏజెన్సీ వ్యాప్తంగా రెండు రోజులు బంద్ ప్రకటన చేయడంజరిగింది అన్నారు. అలానే ఆదివాసి లు ఆందోళ చెందిరోడ్డు పైకి వస్తుంటే స్పీకర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోలేదని ప్రభుత్వం వివరణ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం సవరణ చేస్తే వ్యాపార సంస్థలు వస్తాయిని, టూరిజం అభివృద్ధి చెందుతుందని తద్వారా ఆదివాసుల అభివృద్ధి చంద్రం జరుగుతుందనడం శోసనీయమ్మన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అడవులను ఖనిజ సంపదను దోసుకోవాలని చూస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించడం వల్ల వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, గ్రామాల్లో రోడ్లు వేయాలని, మెరు గైన విద్య వైద్యం అందించాలని కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ ల్లో స్పీకర్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కొంగరమురళీకృష్ణ, సవిరాల చంద్రుడు, కుంజం జగన్నాథం, బొడ్డు వెంకటరమణ, వజ్రపు అప్పారావు, ఈకా ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

## పేదల ఆశయాలు నెరవేరుస్తున్న ప్రభుత్వం



రంపచోడవరం, మేజర్ న్యూస్ : పేదల ఆశయాలు నెరవేరుస్తున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదని రంపచోడవరం టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ రంపచోడవరం మండలంలో గిరిజనుల స్థిరాస్తి 1/70 చట్టం ద్వారా భద్రపరచబడిందని, ధనికుడు పేదవాడు అని వ్యత్యాసాలు లేకుండా ప్యూర్ అండ్ రిచ్ అనే కార్యక్రమాల ద్వారా సంపన్నులు చేయాలని ఆలోచనలో ప్రభుత్వం ఉందని శాసనసభ స్పీకర్ మాటలకు పక్కదారి పట్టిస్తున్నారని సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ మాటలు ఎవరు నమ్మవద్దని తెలియజేస్తూ 1/70 చట్టం పరిరక్షించడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని తెలియజేస్తూ గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల సాంస్కృతి సంప్రదాయాలు కనుగుణంగా గిరిజన ప్రాంత ప్రజల స్థితిగతులు మెరుగుపరిచి జీవో నెంబర్ 3 ద్వారా పదో తరగతి పూర్తి చేయకపోయినా గిరిజన ప్రాంతంలో గిరిజన ప్రజలకు విద్యాభ్యాసాలు అందించాలని ఎన్నో ఉద్యోగాలు ఏర్పాటు చేసారని గుర్తు చేశారు. గిరిజన కుటుంబాలకు భద్రత కల్పించడంలో తెలుగుదేశం పార్టీ పేదల ఆశయాలు నెరవేర్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఏ కూటమి ద్వారా నెరవేరుస్తుందని తెలియజేసారు. పేద గిరిజనులను సంపన్నులుగా చేయాలని విజనరి ఆశయమని గత ప్రభుత్వం 100 రూపాయల అప్పు చేసి పది రూపాయలు వెల్ఫేర్ ద్వారా ప్రజలకు అందించిందని, ప్రజలకు అందించిన సొమ్ము ప్రజల నుండే పన్నుల రూపంలో వసూలు చేస్తూ అప్పుల ఊబిలో నెట్టిందని, గత ప్రభుత్వం చేసిన తప్పులు ఎన్డీఏ కూటమి ద్వారా జరగకూడదని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆర్థిక వనరులు సృష్టించే రాష్ట్రాన్ని కాపాడాలని విజనరీ ముందుకెళ్లడం జరుగుతుందని, ప్రత్యాయనం కన్నా శాశ్వతం మిన్న అనే విధంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని, పేదవాడి మనోభావాలకు అనుగుణంగా పేదవాడిగా తెలియజేయడం జరుగుతుందని, ప్రభుత్వ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలియజేయడం జరుగుతుందన్నారు.

## హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జాతీయ క్రీడ హాకీ పట్ల జిల్లా యువతలో ఆసక్తి, అనురక్తి పెంపోందే రీతిలో డిఎస్ఏ స్టేడియంలో జాతీయ సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను కోరారు.

మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి స్థానిక జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానాన్ని సందర్శించి 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడ అయిన హాకీ పట్ల దక్షిణాది రాష్ట్రాలలో ప్రాచుర్యం, ప్రోత్సాహం కల్పించేందుకు కాకినాడ డిఎస్ఏ మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ ను అభివృద్ధి చేసి, జాతీయ స్థాయి హాకీ పోటీలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ టోర్నమెంట్ ను ఈ నెల 15 నుండి 28 వరకూ రెండు వారాల పాటు డిఎస్ఏ మైదానంలో నిర్వహించడం జరుగుతోందని, ఈ పోటీలను క్రీడా సంరంభం, చైతన్యం వెల్లివిరిసేలా నిర్వహించాలని ఆయన టోర్నమెంట్ ఉప కమిటీలను కోరారు. అనంతరం అంశాలవారీగా ఆయా కమీటీలకు అప్పగించిన పనుల పురోగతని ఆయన అధికారులతో సమీక్షించి సూచనలు,ఆదేశాలు జారీ చేసారు. హాకీ టోర్నమెంట్ గురించిన సమాచారంతో పోస్టర్లు ముద్రించి, కాకినాడ నగరంతో బాటు, జిల్లా అంతటా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పోటీలలో పాల్గొనేందుకు విచ్చేసే క్రీడాకారులకు తగు సదుపాయాలతో బస, రవాణా, వారివారి అలవాట్ల కనుగుణమైన ఆహారం ఏర్పాటు చేయాలని రవాణా, బస, ఆహార కమిటీలకు సూచించారు. టోర్నమెంట్ ప్రారంభ, ముగింపు వేడుకలు, ఆదివారాలలో స్థానిక కళారూపాల సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించేందుకు హాకీ ఫీల్డ్ కు చేరువలో ఓపెన్ ఎయిర్ ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోటీలను తిలకించేందుకు వచ్చే ప్రజల కొరకు స్టేడియం చేరువలో పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. రాత్రి పూట కూడా పోటీలను నిర్వహించేందుకు వీలుగా హాకీ ఫీల్డ్‌లో లైటింగ్ ఏర్పాట్లు, ప్రేక్షకులు, మీడియా కొరకు గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేడియంలో త్రాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. టోర్నమెంట్ ను మధుర ఘట్టంగాను, తదుపరి నిర్వహించే పోటీలకు మార్గదర్శకంగాను నిలిపి ఉంచేలా ప్రత్యేక సావనీర్ ను ప్రచురించాలని తెలిపారు. ఉపకమీటీలు వాటికి అప్పగించిన పనులను సమర్ధవంతంగా నిర్వహించి టోర్నమెంట్ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ జె. వెంకట్రావు, సిపిఓ పి. త్రినాథ్, డిఎస్డిఏఓ బి. శ్రీనివాసకుమార్, కాకినాడ ఆర్డిఓ ఎస్. మల్లిబాబు, పెద్దాపురం ఆర్డిఓ కె. శ్రీరమణి, వివిధ ఉపకమిటీల సభ్యులైన అధికారులు పాల్గొన్నారు.

## కరాటే కాంపిటిషన్‌లో సత్తా చాటిన 'చైతన్య' విద్యార్థులు



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** విక్టరీ షోటో ఖాన్ కరాటే నేషనల్ కాంపిటీషన్ కాకినాడలో ఇంద్రపాలెం సుబ్బిరామిరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన నేషనల్ కాంపిటీషన్ నందు బొమ్మూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ & ఎస్. కె. ఆర్ ఉమెన్స్ కాలేజ్ రాజమండ్రి కటాస్ స్పరింగ్ విభాగంలో 12 ఇయర్స్ 19 ఇయర్స్ కేటగిరిలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్ సాధించి సత్తా చాటారు. గోల్డ్ మెడల్ సాధించిన సిహెచ్ నిషిత్, ఎం. ప్రసన్న వెంకట నాగ సూర్య శ్రీ, సిల్వర్ మెడల్ సాధించిన ఆర్. మనోజ్ఞ, డి. చిన్మయ, వి. ఇందు, సిహెచ్ సునంద, బ్రాంజ్ మెడల్ సాధించిన కె. చరణీకృతి, జి. స్టీఫెన్ రాహుల్, కే. రుత్విక్, వి. అఖిల్ తేజ్ లను తూర్పుగోదావరి జిల్లా ఎస్.పి. డి. నరసింహ కిషోర్ సర్టిఫికెట్స్, మెడల్స్ ఆయన చేతుల మీదుగా ఇచ్చి సత్కరించారు. రాజమండ్రి సిటీ శ్రీచైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇన్చార్జ్ ఉదయ్ శంకర్, ప్రిన్సిపాల్ జి. వి. వి. ఎస్. ఎన్ శర్మ, ప్రైమరీ ఇంచార్జ్ ప్రసన్న, ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. రాఘవ కుమారి, పిడి వై. సుధారాణి, మాస్టర్ పి. అరుణ్ కుమార్, పిఈటి ఏ. నాగు, యాజమాన్యం అభినందించారు. విజేతలకు శ్రీచైతన్య విద్యాసంస్థల ఉత్తరాంధ్ర ఏజీఎం యమ్. వి. సురేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలియచేసారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం

**- మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు**
**- అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల( స్వయం ప్రతిపత్తి)లో కళాశాల డిఎఫ్ ఏపీ ఆధ్వర్యంలో కాకినాడ పోలీస్ శాఖ వారిచే సైబర్ సెక్యూరిటీ మరియు మాదకద్రవ్యాల వ్యతిరేకత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు. కాకినాడ జిల్లా పోలీసు వారిచే ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ పట్ల అప్రమత్తంగా ఉంటూ,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాలలో డీఎఫ్ ఏపీ, ఎన్ఎస్ఎస్ ద్వారా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన కాకినాడ టూ టౌన్ ఏఎస్ఐ ఎస్ నరసింహారావు మాట్లాడుతూ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వ సూచనలను పాటించాలని అన్నారు. మోసగాళ్ల వలలో చిక్కుకోకూడదని కొన్ని సంఘటనలను,సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలను ఉదాహరణలతో వివరించారు. " డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ యువతకు పిలుపునిచ్చారు. కాకినాడ ఎస్పీ బిందు మాధవ్ సూచనల మేరకు యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ కానిస్టేబుల్ ప్రతాప్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, డీఎఫ్ ఏపీ మోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

**- తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్విరామంగా సాగుతున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో పాత పోలీస్ స్టేషన్ వద్ద సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రతీ మంగళవారం జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ ను నిర్వహిస్తున్నారు.

ఈ రోజు కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై జనసైనికులుతో కలిసి పేదలకు అన్నం వడ్డించారు. ఈరోజు ఈ డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా 400 మంది భోజనాలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు స్ఫూర్తితో గత ఎన్నికల అనంతరం నుండి ఈ డొక్కా సీతమ్మ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజనాల శ్రీను,సూరపురెడ్డి నరేష్,మాదారపు వీరబాబు ,గోన శివ,అడబాల వీరబాబు, కనకరాజు,మల్లేపలి గణేష్,కొలమూరి భద్రరావు, రేవూరి శ్రీను, బచ్చల రాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## తాటిపర్తిలో సిద్ది వినాయకుని ఆలయం వద్ద ఏకాహం



**- పురస్కరించుకుని భారీ అన్నదానం-పాల్గొన్న భక్తులు**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తాటిపర్తి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ సిద్ది వినాయకుని ఆలయం వద్ద 4వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు గోపు సూరిబాబు ఆధ్వర్యంలో ఏకాహం కార్యక్రమం సోమవారం ఉదయం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభన ఏకాహం పురస్కరించుకుని మంగళవారం ఉదయం 11గంటల నుండి మహాన్నదానం స్వర్గీయ డా. ఇంధన జయకృష్ణ కుమారుడు డా. ఇంధన లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వరసిద్ది వినాయకుని ఆలయం పున:ప్రతిష్ఠ జరిగి నాల్గవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అప్పటి నుంచి భజన కళాకారుల సంఘం అధ్యక్షులు గోపు సూరిబాబు ఆధ్వర్యంలో నిర్విరామంగా ఈ ఆలయం వద్ద భక్తి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని, దానికి గ్రామ ప్రజలు, నాయకులు, భజన కళాకారులు ఎంతో తొడ్పాటునిస్తున్నారని, ఇదే పద్దతి కొనసాగించాలని ఆయన తెలిపారు. గోపు సూరిబాబు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు, నాయకులకు, నా తోటి భజన కళాకారులకు, పరిసర గ్రామ ప్రజలకు, శ్రీ కోదండరామ బాలభక్త భజన బృందం, శ్రీ కనకదుర్గా ఐశ్వర్యాంబికా మహిళా భజన బృందం సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డా. ఇంధన లక్ష్మీనారాయణను, పలువురు భజన కళాకారులను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపు వల్లయ్య, ద్వారంపూడి చల్లబాబు, బండి సూరిబాబు, కొమ్మిరెడ్డి చిన్నబ్బాయి, గోపు సతీష్, కొమ్మిరెడ్డి రాంబాబు, సమ్మిటి నాని, పలువురు భక్తులు అన్నదానంలో పాల్గొని, అన్నదానం స్వీకారించారు.

## ఎన్ఎంయుఏ బలోపేతానికి చర్యలు




కాకినాడ, మేజర్ న్యూస్ : ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులు గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కోశాధికారి పీ.వీ. మోహన్, రాష్ట్ర కార్యదర్శులు గంగాధర్, పద్మ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోం నందు యూనియన్ కాకినాడ డిపో యూనిట్ సమావేశం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయుఏ సంఘటిత పోరాటాలు ఫలితంగా ఆర్టీసీ కార్మికులకు బకాయిలలో 25శాతం చెల్లింపులు చేయాలని ఆర్టీసీ ఎండీ ఆదేశించారని యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మిగిలిన బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో యూనియన్ జిల్లా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఓఅర్. రాంబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణ రాజు, ఏ.వి.రావు, ప్రసాద్, కె.గోవింద్, బీవీ చక్రం, అధిక సంఖ్యలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలి



- ర్యాలిలో బండారు సంజీవ్ ఎన్నికల ప్రచారం

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ను ఆఖండ మెజార్టీతో గెలిపించాలని టిడిపి యువ నాయకులు బండారు సంజీవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని ర్యాలీ గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తున్న ప్రభుత్వ పనితీరును పరిగణలోకి తీసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, ఉభయగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ ను అఖండ మెజారిటీతో శాసనమండలికి పంపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుళాయిలు రాక ఇక్కట్లు...



**సామర్లకోట,మేజర్‌న్యూస్:** సామర్లకోట మున్సిపాలిటీలో మంగళ వారం కుళాయిల్లో త్రాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రజలకు రక్షిత త్రాగునీరం దించే ప్రధాన పైపు లైను పగిలిపోగా త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే పైపులైను రిపేరు పనులు పూర్త య్యే వరకు బోరులు ద్వారా జలాలు అందించాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు దానికి చర్యలు చేపట్టక పోవడంతో త్రాగునీరు, ఇతర అవసరాల కోసం నీరులేక పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ట్యాంకర్లు అన్ని వార్డులకు చేరకపోవడంతో ప్రజలు త్రాగునీటికోసం ప్రజలు అల్లాడారు. అధికారులు తక్షణం స్పందించి త్రాగునీరు విషయంలో ప్రత్యామ్నాయ్యం ఏర్పాటు చెయ్యాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

- ప్రశాంతంగా 'మన్యం' బంద్

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులు పాటు మన్యం బంద్ పిలుపులో భాగంగా మొదటి రోజు మంగళవారం రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో మన్యం బంద్ ప్రశాంత వాతావరణం లో విజయవంతంగా జరిగింది. ఈ బందులో సిపిఎం,సిఐటియు,అఖిలపక్ష ప్రజాసంఘాలు, గిరిజన సంఘాలు, వైఎస్ఆర్సిపి పార్టీల నాయకులు తెల్లవారుజాము నుండి రోడ్లపై చేరుకుని తమ నిరసనను తెలియజేశారు... రంపచోడవరంలో జరుగుతున్న 48 గంటల బంద్ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, కంభం శాంతి రాజు మరియు రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొని వ్యతిరేకంగా అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలనుందించుకోవాలని గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరిని తెలియజేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి కావాలంటే 1/70 యాక్ట్ అడ్డంగా ఉందని, సవరణ పెట్టుబడిదారులు వస్తారని చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు మన్యం బందు చేస్తున్నామని,




ఆయన మాట్లాడినప్పటినుండి ఇప్పటివరకు కూడా అనేక నిరసన కార్యక్రమాలు చేస్తూ ఈ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వందా లేక స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యక్తిగత వైఖరినా ప్రకటించాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు స్పందించింది లేదని, నిన్న రాత్రి మాత్రం రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి స్పందించారని, అంటే ఇన్ని రోజులు తాను చేస్తున్న నిరసనలు రాష్ట్ర ప్రభుత్వానికిగాని మంత్రులకు గాని కనబడలేదని ప్రశ్నించారు. 1/70 రక్షణ కోసం తాము రెండు రోజులపాటు బంద్ నిర్వహిస్తుంటే ఎన్నికల కోడ్ పేరు చెప్పి భారీగా పోలీసు బందోబస్తు పెట్టి బందును విచ్చలనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని, అయితే ఆదివాసీల ఉద్యమాలు ప్రాణ త్యాగాలతో వచ్చిన ఈ చట్టాలు మళ్లీ నిర్వీర్యం చేద్దామని చూస్తే ప్రాణత్యాగాలు చేసి అయినా వాటిని రక్షించుకోవడానికి తమ సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి 1/70 ని గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన ఒక సభలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 సవరిస్తే చేస్తే తప్ప ఏజెన్సీ ప్రాంతంలోని టూరిజం అభివృద్ధి చేయలేదని అన్నారని, గిరిజనులకు గిరిజన ప్రాంతాలకు భరోసాగా ఉన్నటువంటి 1/70ని సవరించి కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేద్దామని చూస్తున్న కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటే దానిని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు అభివృద్ధి చేయకపోగా గిరిజన చట్టాలను సవరించాలనడం చాలా అమానుషమైన విషయమే అని అన్నారు. 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే రానున్న కాలంలో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఏఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంభం శాంతిరాజు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు, ప్రగతిశీల ప్రజా సంఘం నాయకులు, వైయస్సార్ పార్టీ నాయకులు, ఇతర గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కానూరు పిహెచ్సి, పెరవలి పీహెచ్సీలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి కే వెంకటేశ్వర రావు




**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కే.వెంకటేశ్వరరావు ఫిబ్రవరి 11వ తేదీ మంగళవారం పెరవలి మండలంలోని కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మండలంలో కానూరు పిహెచ్సి మరియు పెరవలి పిహెచ్సి పరిధిలో గల వివిధ గ్రామాల్లో ఉన్న పౌల్ట్రీ ఫామ్‌ల బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు ప్రబలుతున్న కారణంగా వ్యాధి వచ్చి చాలా కోళ్లు చనిపోవడం జరుగుతుంది అని వాటికి తగు జాగ్రత్తలు తీసుకో వలసినదిగా సిబ్బందిని ఆదేశించారు. ఈరోజు నుండి వారంరోజులపాటు ప్రతి గ్రామాలలో ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలు గల వారినిగుర్తించవలసిందిగా ఆదేశించారు. రాబోయే ఐదు, ఆరు రోజుల పాటు గ్రామాల్లో టీంలు ఏర్పరిచి ఆ టీముల ద్వారా పరిస్థితిని వివిధ శాఖల అధికారులు సహకారం వారితో కోఆర్డినేట్ చేసుకొని పరిస్థితిని అదుపులోఉంచుకోవాలని ఆదేశించారు.అందులో భాగంగా పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించిన సందర్భంగా ప్రగతిని కూడా సమీక్షించారు.రాబోయే రెండు మూడు వారాల్లో అన్ని ఆరోగ్యకార్యక్రమాలు అమలులో సిబ్బంది అందరినిభాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న ఎన్సిసిడి సర్వేలో గృహ సందర్శనములు చేసి క్యాన్సర్, బిపి షుగర్ వ్యాధి, రక్త హీనత మరియు బిఎంఎస్ సంబంధించిన లక్షణాలు గుర్తించుట , లక్షణాలు కలిగి ఉన్న వారినిహయ్యర్ హాస్పిటల్స్ కు రిఫరల్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని మరియు వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి రాబోయే రెండు వారాల్లో అన్ని కార్యక్రమాలు 100% శాతం ప్రగతిసాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వరావు వారి సిబ్బంది కానూరు పీహెచ్సీ పెరవలి పీహెచ్సీ కు సంబంధించిన సిబ్బంది ఈ సమీక్షలోపాల్గొన్నారు.తదుపరి కానూరుఅగ్రహారం గ్రామంలో కోళ్లఫారంలో వచ్చిన బర్డ్ ఫ్లూ కారణంగా గ్రామంలో నిర్వహించిన గృహాల సర్వేను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే. వెంకటేశ్వరరావు, కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డియమ్ హెచ్ఓ. ధర్మరాజు పరిశీలించారు. అక్కడ వైద్య పరీక్షలునిర్వహిస్తున్న డాక్టర్ రాజీవ్, డాక్టర్ అభిషేక్, కానూరు పిహెచ్సి డాక్టర్ కే. హేమరాజు, డాక్టర్ పి. తేజశ్రీ తోపాటు ఆశ వర్కర్లు సూపెర్వైజర్స్ సిబ్బంది కి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడ వాస్తవ్యులు హరికృష్ణ దీప్తి, సుశ్రీత్ కృష్ణ రూ. 1,00,000లు విరాళంగా దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీ ప్రతి సంవత్సరం డిసెంబర్ నెల 11వ తారీఖున అన్నదానం జరిపించాలని దాత కోరినారు. దాతను దేవస్థానం అధికారులు అభినందించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలి

- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి
- కొవ్వూరు ఆర్ డి ఓ రాణి సుస్మిత



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 27 వ తేదీన నిర్వ హించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ద్వై వార్షిక గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు మేరకు పనిచేయాలని కొవ్వూరు ఆర్ డి ఓ రాణి సుస్మిత కోరారు. ఫిబ్రవరి 11వ తేదీ మంగళవారం పెరవలి మండలంలో పోలింగ్ స్టేషన్లనుపరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూఫిబ్రవరి 27 న పోలింగ్ కు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రంలో 750 నుంచి 1000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే ఏర్పాట్లు చెయ్యడం జరిగిందని పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగాసజావుగానిర్వహించాలన్నారు పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. పెరవలి మండలంలో మూడు పోలింగ్ స్టేషన్లో 1927 మంది ఓటర్లు ఉండగా పురుషుల ఓటర్లు 1110, మహిళా ఓటర్లు 817 మంది ఉన్నారని ఆర్డీవో తెలిపారు.ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పిఓ,ఏపిఓలకు, ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని, త్రాగునీరు, విద్యుత్ , షామియానాలు, ర్యాంపులు, టాయిలెట్, టెలిఫోన్, తదితర వసతులను కల్పించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాహిసిల్దార్, డి.అచ్యుతకుమారి రెవెన్యూ ఇన్స్పెక్టర్ పులిదిండి పావని తదితరులు పాల్గొన్నారు.

# రమణయ్యపేటలో మురుకు కాలువలకు మోక్షం!

- ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాలతో ముమ్మరంగా కాలువ ఆధునీకరణ పనులు
- పనులు పరిశించిన మాజీ ఎంపిటిసి రాయుడు అనిల్ - సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు




**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** మేజర్ పంచాయతీ రమణయ్యపేట కాలువ పనులు ఎట్టకేలకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు అధికారులు శరవేగంగా పనులు చేపట్టారు. రమణయ్యపేట మాజీ ఎంపిటిసి, టీడీపీ నాయకులు రాయుడు అనిల్ విజ్ఞప్తి మేరకు స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశాలతో రమణయ్యపేట అధికారులు ముందడుగు వేసి ఎప్పటినుంచో కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా రాయుడు అనిల్ మంగళవారం మురికి తీత పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ... గ్రామంలో ఇండస్ట్రియల్ ఏరియా, దండుపుంత, ఏపీఐఐసీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, మురళీధర్ నగర్, కాలువ గట్టు ప్రాంతాల నుండి వచ్చే మురికి నీరు ఈ కాలువలో కలువడం జరుగుతుందన్నారు. దీంతో వ్యర్థాలు పెరిగిపోయి కాలువ మురికి కూపంగా తయారైందన్నారు. ఈ పరిస్థితిని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే కాలువ శుభ్రం చేయాలంటూ పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహారావు వెంటనే స్పందించి సిబ్బందిని రంగంలో దింపి హుటాహుటిన కాలువను శుభ్రం చేయించడం జరుగుతుంది. ఈ సందర్భంగా స్థానికులు శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జగన్ స్కాములపై విచారణ తప్పనిసరి

- రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ డిమాండ్
- కాకినాడ పురోగతిపై ప్రస్తావన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలపై సీబీఐ, ఈడి సంస్థలతో విచారణ చేయించాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో తాడేపల్లి కేంద్రంగా జరిగిన స్కాముల వల్ల ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నష్టపోయిందని పేర్కొన్నారు. రూ. 20 వేల కోట్ల రూపాయల లిక్కర్ స్కామ్ ఇందులో ప్రధానమైందని రాజ్యసభ దృష్టికి తీసుకొచ్చారు. సీబీఐ, ఈడీ తరహా ఉన్నత సంస్థలతో విచారణ జరిపించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర ఆర్థిక బడ్జెట్ పై రాజ్యసభలో చేపట్టిన చర్చ సందర్భంగా సానా సతీష్ బాబు ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం గడిచిన ఏడు నెలల వ్యవధిలో 4లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించిందని సభ దృష్టికి తీసుకువచ్చారు.
కేంద్రం సహకరిస్తే కాకినాడ పురోగతి సాధ్యం..బడ్జెట్ పై చేపట్టిన చర్చ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పది నిమిషాల పాటు ప్రసంగించారు. కాకినాడ ప్రాంత అభివృద్ధిపై కేంద్రం సహకారాన్ని కోరారు. ఎకనమికల్ హబ్, ట్రేడ్ హబ్ గా ఎదిగే సామర్థ్యం కాకినాడ ప్రాంతానికి ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. కాకినాడ పోర్టు సుదీర్ఘ చరిత్రను ప్రస్తావిస్తూ నౌకానిర్మాణ పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న సానుకూల అవకాశాలను వివరించారు. ఉప్పాడ జాంధాని చీరల ప్రత్యేకతను ప్రస్తావిస్తూ చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం టెక్స్ టైల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. కాకినాడ - అన్నవరం మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మించాలని, ఉప్పాడ వద్ద సముద్రపు కోత నివారణకు రూ 200 కోట్ల రూపాయలతో కోస్టల్ ప్రొటెక్షన్ ప్రాజెక్టును చేపట్టాలని కేంద్రాన్ని కోరారు. కాకినాడ పోర్టును ఎన్ హెచ్ 216కు అనుసంధానం చేస్తూ రూ. 235 కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టాలని కోరారు. అలాగే, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు, కాకినాడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ తదితర అంశాలను రాజ్యసభ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు.

## రైలు ప్రమాద మృతుడు గుర్తింపు

**ఏలూరు,మేజర్ న్యూస్:** మృతుడు గుర్తింపు. మృతుడు రోకళ్ళ. సూర్యనారాయణ, తండ్రి రాములు, ఎ/54, గోకర్ణపురం గ్రామం, శ్రీకాకుళం జిల్లా. మృతుడు గత నెల రోజులుగా హైదరాబాద్‌లో కూలిపనులు చేసుకుంటూ, తన స్వగ్రామం వెళ్లే నిమిత్తం రైలు బండిలో ప్రయాణం చేయుచూ ప్రమాదవశాత్తు గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు బండి నుంచి జారిపడి మృతి చెందినాడు. ఈరోజు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపంచనామ అయిన అనంతరం ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ మృతదేహన్ని వారి రక్త బంధువులకు అప్పగించారు.

# 1/70 చట్టాన్ని పరిరక్షిస్తాం




రంపచోడవరం, మేజర్ న్యూస్ : 1/70 చట్టం మార్చే ఎలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని, 1/70 చట్టాన్ని పరిరక్షిస్తామని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆదివాసి చట్టాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈవిషయంలో గిరిజనులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గిరిజనులకు మెరుగైన సంక్షేమం అందిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మొదటి నుండి గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. భవిష్యత్తులోను కూటమి ప్రభుత్వం గిరిజన చట్టాల అమలుకే కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.
జీవో 3 పునరుద్ధరణకు హామీ:జీవో 3 పునరుద్ధణ హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రంపచోడవరం మరో మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్ తెలిపారు. 1986 నవంబర్ 5న నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం జీవో 275 ద్వారా 5వ షెడ్యూల్‌లోని 5(1) కింద ఉపాధ్యాయ పోస్టుల్లో స్థానిక ఆదివాసులకే వంద శాతం ఇవ్వాలని స్పష్టం చేసిందని తెలిపారు. అయితే దీనిపై కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు తీర్పుకు అనుగుణంగా 2000 జనవరి 10న నాటి చంద్రబాబు ప్రభుత్వం జీవో 275లో మార్పులు చేసి ఆదివాసులకు వంద శాతం ఉపాధ్యాయ పోస్టుల భర్తీని స్పష్టం చేసేలా జీవో 3ను విడుదల చేసిందన్నారు. అయితే దీనిపై కొంతమంది సుప్రీం కోర్టుకు వెళ్లగా, 2002లో సుప్రీం కోర్టు జీవో 3ను రద్దు చేసిందని తెలిపారు.
గిరిజన ప్రాంత యువతకు గుండెకాయలాంటి జీవో నంబర్ 3ను సుప్రీంకోర్టు కొట్టివేస్తే రివ్యూ పిటిషన్ వేయాల్సిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలు ఆదివాసీలకు దక్కడం జగన్‌కు, వైసీపీ పార్టీ నాయకులకు ఇష్టం లేదన్నారు. గిరిజన ప్రాంత యువత ముక్తకంఠంగా కోరినా జగన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ దృష్టికి జీవో 3 అంశం తీసుకురాగానే పునరుద్ధరించడానికి కృషి చేస్తామని, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్ తెలిపారు.

## శ్రీ మరిడమ్మ అమ్మవార్కి రెండు నూతన గరగలు బహుకరణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం పెద్దాపురం పట్టణానికి చెందిన భక్తులు అమ్మవారి గరగల సంబరం చేసుకొను నిమిత్తం రెండు నూతన గరగలు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి చెన్నై వాస్తవ్యులు వెంకటరావు, దీప రూ. 1,00,116లు విరాళం పిఆర్ఓ దామోర్ల కృష్ణారావుకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం జనవరి 8వ తారీఖున అన్నదానం జరిపించాలని దాత కోరారు. దాతను దేవస్థానం అధికారులు అభినందించారు.

## శ్రీ సత్య దేవుని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంకి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుటుంబ సభ్యులతో శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా దేవస్థానం ఈవో వి.సుబ్బారావు, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుటుంబ సభ్యులు శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా దేవస్థానం ఈవో వి.సుబ్బారావు శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు.